
కాలనీవాసుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రెస్ కాలనీలో స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు దీర్ఘకాలిక వరదనీటి సమస్యకు పైప్‌లైన్ నిర్మించి శాశ్వత పరిష్కారం చేసిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. శ్మశానవాటికలో స్నానాల గదులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, నాగరాజు, జగదీశ్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్‌లో మేయర్‌కు పండు తినిపిస్తున్న మహిళ

సరూర్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని షరీఫ్‌నగర్‌లో మంగళవారం రాత్రి స్థానిక మైనారిటీ నాయకుడు రియాజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం మైనారిటీ సోదరులకు, మహిళలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని మతాల పండుగలను సామరస్యపూర్వకంగా జరుపుకుని సర్వమత సౌభ్రాతృత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఉన్నదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్పొరేటర్ బండారి మనోహర్, నాయకులు అహ్మద్‌బామ్, అబ్దుల్‌బారీ, రియాసత్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్: తుర్కయంజాల్‌లో మంగళవారం రాత్రి పలువురు ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండగలను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, మేతరి దర్శన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

హయత్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఇన్నర్‌మేషన్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలోని అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ దశలవారీగా అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.


మానవహారంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● మీర్‌పేట్ కమిషనర్ చంద్రశేఖర్

సరూర్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని రాజ్యాంగ విలువలను కాపాడాలని మీర్‌పేట్ కమిషనర్ బి.చంద్రశేఖర్ సూచించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించే నిమిత్తం బుధవారం మీర్‌పేట్ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి, అనంతరం చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ స్థానికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లడుతూ వజ్రాయుధంలాంటి ఓటు హక్కును వినియోగించుకోకపోతే మనిషి బతికున్నా మరణించినట్లేనని వ్యాఖ్యానించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, మెప్మా సభ్యులు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఒక్కపూట పని కల్పించాలని పారిశుధ్య కార్మికుల వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకుడు నర్సింహ

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో ఒక్కపూట పని కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ విపరీతంగా ఎండలు కొడుతున్న దృష్ట్యా కార్మికులకు ఒక్కపూట మాత్రమే పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 8గంటలు పని చేస్తారని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు నూనె, గ్లౌజ్‌లు, చెప్పులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కళమ్మ, లక్ష్మమ్మ, పుష్ప, సుమలత, పార్వతమ్మ, స్వరూప, బాయ్యమ్మ, మంగ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని

తల్లిదండ్రుల ఆందోళన

హయత్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ లెక్చరర్స్ కాలనీలో ఉన్న భాష్యం బ్లూమ్స్ పాఠశాల ఎదుట బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. 2024- 2025 విద్యా సంవత్సరానికి అదనంగా 25శాతం ఫీజును చెల్లించాలని విద్యార్థులను వేధిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ హీర్యానాయక్, కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే కార్పొరేటర్ ఎంఈఓతో కలిసి వచ్చి పాఠశాల సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఫీజు పేరుతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తరగతి గదిలో వేధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు రావడానికే బయపడుతున్నారని తెలిపారు. జూన్ 10వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డెడ్ లైన్ విధించారని అన్నారు. సీబీఎస్ఈ పేరుతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి ఉందా లేదా అని ఎంఈవో ముందే ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పాఠశాలలో విద్యాబోధన సరిగా జరగడం లేదని, అర్హత గల ఉపాధ్యాయులు లేరని ఆరోపించారు. ప్రిన్సిపాల్ పేరెంట్‌నే బెదిరిస్తున్నారని తెలిపారు. 1వ తరగతికి రూ. 55వేలు ఉన్న ఫీజును రూ.63వేలకు పెంచారని పేరెంట్స్ తెలిపారు. ఎక్కువ మాట్లాడితే టీసీ ఇచ్చి పంపిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారని అన్నారు.


పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈవో, కార్పొరేటర్

సీబీఎస్ఈ అనుమతి ఉందా..?

పేరేంట్ నుండి ఫిర్యాదు అందుకున్న ఎంఈఓ హీర్యానాయక్ పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ఎంఈవో ముందే పేరెంట్స్ పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి ఉందా అని ప్రశ్నించారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఉందని తెలిపారు. అందుకు సంబంధించిన కాపీ ఇవ్వడానికి ప్రిన్సిపాల్ నిరాకరించారు. దీంతో పేరెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో జరుగుతున్న విషయాలపై జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పిస్తామని ఎంఈవో తెలిపారు.

ఫీజుల పేరుతో వేధిస్తే సహించం: కార్పొరేటర్

ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తే సహించేది లేదని కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. భాష్యం పాఠశాలపై కొంత కాలంగా అనేక మంది పేరెంట్స్ ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

గత సంవత్సరం చెప్పి పెంచాం : ప్రిన్సిపాల్ విజయ

ఫీజు పెంచుతున్న విషయం డిసెంబర్ నెలలోనే పేరెంట్స్‌కు చెప్పాం. అందులో భాగంగానే 10శాతం పెంచాం. సీబీఎస్ఈ అనుమతి ఉందని ప్రిన్సిపాల్ విజయ తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడిన మోదీ

● మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

చంపాపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ అయోధ్యలో రామమందిరం నిర్మించి మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడిన గొప్ప వ్యక్తి అని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. చంపాపేట డివిజన్‌లోని డిఫెన్స్‌కాలనీ, ఉదయ్‌నగర్‌కాలనీ, మారుతీనగర్‌కాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారితో కలిసి ఈటల రాజేందర్ ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలం నుంచి మోడీ ప్రతి ఒక్కరికీ 5కిలోల చొప్పున ఉచితంగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులలో జన్‌ధన్ జీరో ఖాతాలను తెరిపించారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కమలంపువ్వు గుర్తుకు ఓట్లేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని రాజేందర్ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, గూడూరు అవినాష్‌రెడ్డి, పాశం శ్రీశైలం, సిల్వేరు అనిల్‌కుమార్, వెంకటేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌నాయుడు, అంజి, సుమిత్, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్, శ్రవన్‌కుమార్, రజిత, విజయశ్రీ, కవిత పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన శివసేన పార్టీ నేత

హస్తినాపురం డివిజన్ శివసేన పార్టీకి చెందిన బొమ్మిడి కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విక్రమ్‌యాదవ్, రామకృష్ణ, కిషోర్‌చారి, మల్లికార్జున్‌రెడ్డి, రవికుమార్‌తో పాటు మూడు వందల మంది కార్యకర్తలు బుధవారం మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న కిరణ్‌రెడ్డి

ఈటలను ఎంపీగా ఢిల్లీకి పంపాలి : జమున

హయత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి జమున మన్సూరాబాద్ డివిజన్‌లోని బొమ్మలగుడి వద్ద గల శివం హిల్స్ కాలనీలో మహిళలతో సమావేశం అయ్యారు. కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జమున మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు ఈటల రాజేందర్‌ను బీజేపీ ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపాలని మహిళలను కోరారు. ప్రతి మహిళా 100మంది ఓటర్లను ప్రభావితం చేసి ఈటలను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈటల రాజేందర్‌ను గెలిపిస్తేనే మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

● రాచకొండ సీపీ తరుణ్ జోషి


మాట్లాడుతున్న సీపీ తరుణ్ జోషి

వనస్థలిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి అన్నారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ, ఎల్బీనగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లతో బుధవారం రాత్రి క్రైమ్ రివ్యూ మీటింగ్ ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ జోన్‌లోని వివిధ స్టేషన్లలో నమోదైన పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పెండింగ్ గ్రేవ్ కేసుల విచారణ, ఇతర కేసుల విచారణ పురోగతి మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎల్బీనగర్ జోన్ పరిధిలో జరిగే నేరాలను అదుపులో ఉంచాలని, నేర నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారి బాధలను ఓపికగా విని తగిన న్యాయం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎల్బీనగర్ జోన్‌లోని ఆయా స్టేషన్ల సిబ్బంది యొక్క పనితీరు గురించి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వారి ఫిర్యాదులకు తక్షణమే స్పందించి సత్వర న్యాయం చేకూర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీలో 2023-2024 సంవత్సరానికి ఆస్తిపన్ను వసూళ్లు, ఎర్లీబర్డ్ స్కీం వసూళ్లపై అధికారులు, సిబ్బందితో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ బుధవారం నగరంలోని బంజారాభవన్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లలో ఉత్తమ పనితీరు కనబర్చిన జహంగీర్ పాష, ఏ.రాంరెడ్డి, డీ. అర్చన, ఎస్. భార్గవ్‌కృష్ణ, జీ. సత్యనారాయణలతో పాటు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లలో ఉత్తమ పనితీరు కనబర్చిన కే. శివరాజ్, ఏ.రాంరెడ్డి, ఎం.శివరాజ్, ఎన్. సత్యనారాయణ, మక్కత్‌లాల్ బానోతులను కమిషనర్ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఉపకమిషనర్లు యాదయ్యతో పాటు సహాయ కమిషనర్లు, వాల్యుయేషన్ ఆఫీసర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



ఇటీవల టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎస్వీ కృష్ణప్రసాద్‌ను గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ బద్దుల వెంకటేశ్‌యాదవ్, గడ్డిఅన్నారం డివిజన్ పార్టీ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్, నాయకులు విజయ్, వేణుగోపాల్, బాషా, శివయాదవ్, కృష్ణయాదవ్, కిరణ్‌తో కూడిన బృందం బుధవారం కలిసి సన్మానించారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

భద్రాద్రి రామయ్య కళ్యాణ తలంబ్రాలు

ఇంటికి చేరవేయనున్న ఆర్టీసీ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని కళ్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికే చేరవేసేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. స్వామి వారి కళ్యాణ తలంబ్రాలు అవసరమైన భక్తులు 8015451791, 9154298733, 7382837562 మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి రూ.151తో స్వయంగా బుకింగ్ చేసుకోవాలని ఆర్టీసీ ఎంజీబీఎస్ లాజిస్టిక్ ఏటీఎం సీ.రవీందర్ తెలిపారు. ఆర్టీసీ ఎంజీబీఎస్‌లోని పార్శిల్ బుకింగ్ వద్ద సంప్రదించి స్వామి కళ్యాణ తలంబ్రాలను పొందవచ్చని సూచించారు.

గంజాయి పట్టివేత

చంపాపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఇంట్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లోని ఆసియా తన్విమ్ సుల్తానా(47)గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమె ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. ఈ సోదాలలో ఇంట్లో దాచి ఉంచిన రూ.62,500 విలువైన రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆసియా తన్విమ్ సుల్తానాపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గంజాయితో పాటు మొబైల్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసులో

నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించడంతో పాటు రూ. 2లక్షల నష్టపరిహారం చెల్లించాలని అత్యాచారం, పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి తీర్పు చెప్పారు. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం ఈ నెల 3న బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. బాలిక స్థానిక దుకాణానికి స్టిక్కర్ కోసం వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. జైపురికాలనీ నివాసి ట్యాంకర్ డ్రైవర్ ఈశ్వర్‌పై అనుమానంతో ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో నిందితుడు సదరు బాలికను విజయవాడలోని తన బంధువుల ఇంటికి తీసుకెళ్లాడని తెలియడంతో పోలీసులు బాలికను రప్పించి సాక్ష్యాధారాలతో సహ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎంకే పద్మావతి నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించడంతో పాటు రూ. 2లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పుఇచ్చారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మంగమ్మశివకుమార్

హయత్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 97వ జయంతిని బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మన్నెగూడ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. స్థానిక కురుమ సంఘం నాయకుడు రమేష్ కురుమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సామ భీంరెడ్డి, లక్ష్మారెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, గుడ్ల అర్జున్, శ్రీనివాస్, భద్రయ్య, రవి, వెంకట్ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వనస్థలిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీ టికెట్లు మాదిగలకు కాంగ్రెస్ పార్టీ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్‌బీనగర్‌లోని బాబు జగ్‌జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ మాదిగలకు ఎంపీ టికెట్లు ఇవ్వకుండా అవమాన పర్చడం సరైంది కాదన్నారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని సొంత పూచికతలపై వదిలిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహ, శేఖర్, రాజు, సురేష్, రవి, చిరంజీవి, చిన్న, హుస్సేన్, పుల్లయ్య, ముత్యాలు, రాజు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు

● కాంగ్రెస్ బహిష్కృత నేత జడ్సన్

పంజాగుట్ట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాల పాటు జరిగిన దోపిడీపై నిరంతరం ఉద్యమించా. కాంగ్రెస్ ఐడియాలజీని పాటిస్తూ.. పూర్తిగా పార్టీ ఆర్గనైజేషన్‌కు అంకితమయ్యా. ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు వేశారు' అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు లాభం చేయడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అత్యధిక సీట్లు గెలవాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు పథకం కింద ఇవ్వాలని పెట్టిన రూ.7వేల కోట్లను ప్రస్తుత సీఎం ఏమి చేశారని, ఇప్పటి వరకు కాంగ్రెస్ బ్యానర్ కింద చేసిన ఉద్యమాలను కొనసాగించడానికే తెలంగాణ వనరుల రక్షణ సమితిని ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన సస్పెన్షన్, భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. తనకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారని, ఫిర్యాదులు ఏమిటో చెప్పాలని అడిగినా.. అప్పటికే తీసుకున్న నిర్ణయం ప్రకారం తనను సస్పెండ్ చేశారన్నారు. వివిధ శాఖల్లో నిధుల దుర్వినియోగంపైన ఈడీకి, సీబీఐకి, కొందరి రాజకీయ నేతల అవినీతిపై తను చేసిన ఎన్నో ఫిర్యాదుల గురించి వివరించారు. ప్రాణభయం, రాజకీయ భవిష్యత్‌పై ఆశ వదిలేసి కల్వకుంట్ల కుటుంబంపై పోరాటం చేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తా, వేయిస్తా అని అన్నారు. నేను ఎవరి చేతుల్లో ఆయుధం కాదన్నారు. అన్నింటిపైన ప్రశ్నిస్తున్న తనను సస్పెండ్ చేశారని, అయినా కూడా పార్టీమారే పరిస్థితి లేదన్నారు.

సాయికృపా కాలనీలో షార్ట్ సర్క్యూట్

● విలువైన గృహోపకరణాలు దగ్ధం

సరూర్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని సాయికృపా కాలనీలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తలెత్తి పలు ఇళ్లలోని విలువైన గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కాలనీ మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్ ఉండడంతో దాని కారణంగానే షార్ట్ సర్క్యూట్ తలెత్తి ఉంటుందని భావిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లలోని విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు మాడిమసై పోయాయి. పలు ఎలక్ట్రానిక్ పరికరాలు సైతం పాడైపోయాయి.

నేతల పర్యటన

కాగా షార్ట్ సర్క్యూట్ విషయం తెలుసుకున్న మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి బుధవారం కాలనీలో పర్యటించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అప్పటికప్పుడు ట్రాన్స్‌కో అధికారులను అక్కడికి పిలిపించి, బాధితుల కు న్యాయం జరిగేలా చూడాలని సూచించా రు. భవిష్యత్‌లో మళ్లీ షార్ట్ సమస్య ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్రాన్స్‌కో తరఫున ఆర్థిక సాయం అందేలా చూస్తామని ఈ సందర్భంగా వారు బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, కాంగ్రెస్ నాయకులు సిద్దాల బాలప్ప, పోరెడ్డి సురేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు బల్వంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన స్విచ్ బోర్డు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

సరూర్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు బుధవారం మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్మన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అధోగతి పాలయిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కటొక్కటిగా బయటకు వస్తున్నాయని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు దక్కించుకుంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, నాయకులు రవినాయక్, అమృతానాయుడు, కళ్లెం పద్మారెడ్డి, స్వామినాయక్, బాలకృష్ణాగౌడ్, రజిత, ఎల్లమ్మ, లక్ష్మీ, సంధ్య రేణుక పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్

సైదాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా యాఖత్‌పురా నియోజకవర్గం వాణినగర్‌కు చెందిన కోట్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. బుధవారం ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్లమెంట్ అత్యధిక సీట్లు కైవసం చేసుకునే విధంగా కృషి చేస్తానని తెలిపారు. పదవి రావటానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మధుయాష్కీలకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

చంపాపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సైదాబాద్ కుర్మగూడకు చెందిన టి.సాయిప్రకాష్(32)అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. చికిత్స నిమిత్తం సాయిప్రకాష్ ఈ నెల 1న నాంపల్లిలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ సాయిప్రకాష్ మృతి చెందడంతో బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా అంత్యక్రియల కోసం ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి 20వేల రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సిటీ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొని మృతుని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్న నలుగురి అరెస్ట్

● చిల్డ్రన్ బ్యాంకు నోట్లతో మోసం


నకిలీ కరెన్సీతో నిందితులు

హైదరాబాద్ సిటీ/ పహాడిషరీఫ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులను మహేశ్వరం ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర, జూనా జల్నా ప్రాంతానికి చెందిన షేక్ హరూన్(40) గతంలో నకిలీ నోట్లు చెలామణి చేస్తుండగా ఔరంగాబాద్ పోలీసు లు అరెస్ట్ చేశారు. బయటకు వచ్చాక ఔరంగాబాద్‌కు చెందిన ఆటోడ్రైవర్లు సయ్యద్ సాగిర్(30), జాకీర్ సయ్యద్ (35), అలీ అఫ్తాబ్ అక్తర్ (36)ను కలుపుకొని ముఠా ఏర్పాటుచేశాడు. వీరు కారులో తిరుగుతూ అసలుకు మూడు రెట్లు నోట్లు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. నమ్మి వచ్చిన వ్యక్తులకు నోట్ల కట్టల్లో ముందు, వెనుక అసలు నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోట్లు ఉంచి మోసం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు హరూన్, సయ్యద్ సాగిర్, జాకీర్ సయ్యద్, అఫ్తాబ్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 25 లక్షల విలువైన చిల్డ్రన్ బ్యాంకు నోట్లు, నిసార్ కారు, 4 స్మార్ట్‌ఫోన్లు, 3 చిన్నఫోన్లు, రూ. 8420 నగదు స్వాధీనం చేసుకున్నారు.